## 12

# నిర్ణయం తీసుకునే సమయం!

## (మత్తయి 6:19-24)

నేను విన్న ఒక పాత కథ యిది. పూర్వ కాలంలో బంగాళాదుంపల తొక్కను తీయడానికి ఒక వ్యక్తికి ఈ పనిని అప్పగించారు. "తొక్కు తీసిన తరువాత వాటి సైజును బట్టి వాటిని మూడు రకాలుగా విభజించు, చిన్నవి, మధ్యస్థంగా ఉండేవి మరియు పెద్దవాటిని మూడు వేర్వేరు రాశులుగా పోయి" అనే పని అప్పగించిన వ్యక్తి పనివానికి చెప్పాడు. ఒక గంట గడిచిన తరువాత ఆ పనివాడు యజమానిని కనుగొని, బంగాళాదుంపల తొక్కు తీయడం యింత కష్టమైన పని అని అనుకోలేదండి అని వాపోయాడు. అందుకు యజమాని, "బంగాళాదుంపల తొక్కు తీయడం అంత కష్టమైన పని కాదు గాని అవి ఏ సైజులో ఉన్నాయో నిర్ధారించుకుని వాటిని వేరుపరచడం కష్టం!" అని అన్నాడట.

ఇది పాత కథే కావచ్చు, కాని మనలో ఎంతోమంది బంగాళాదుంపలను వేరుపర్చలేని స్థితిలో ఉన్నారు. మనకు నిర్ణయాలు తీసుకోవడం యిష్టం ఉండదు. అలాగాక మనం ప్రతి రోజూ నిర్ణయాలు తీసుకోవాలి.[1] ఈ రోజున ఏం టిఫను చేయాలి, ఏ బట్టలు వేసకోవాలివంటి నిర్ణయాలు అంత ప్రాధాన్యం కాదు గాని, ఏ రంగంలో స్థిరపడాలి, ఎవరిని వివాహం చేసుకోవాలి వంటి నిర్ణయాలు ప్రాముఖ్యమైనవి. ఈ నిర్ణయాలు మన జీవితం మీద పెను ప్రభావం చూపిస్తాయి. ఏదేమైనా, దేవుని సేవించాలి అన్న నిర్ణయం కంటే మరే నిర్ణయం ప్రధానమైనది కాదు. ఈ నిర్ణయం కేవలం మనలను మాత్రమే ప్రభావితం చేయదు గాని మన నిత్యత్వమును యిది ప్రభావితం చేస్తుంది.

మన వాక్య భాగములో జీవితాన్ని మార్చివేసే నిర్ణయాలు మరియు *నిత్యత్వమును – మార్చివేసే* నిర్ణయాలు గురించి తెలుసుకుంటాము. మన వాక్యభాగములో నిర్ణయం తీసుకొనదగ్గ విషయాలు మూడింటిని మనం చూస్తాము.

### భూమి లేదా పరలోకం? (6:19–21)

**భూమి మీద కాదు**

మొదటి నిర్ణయాంశం 19 నుండి 21 వచనాలలో కనబడుతుంది: భూమి మరియు పరలోకం అన్న విషయాన్ని మనం తేల్చుకోవాలి. ఈ అంశం ఈ మాటలతో ప్రారంభమవుతుంది: "భూమి మీద మీ కొరకు ధనము కూర్చుకొనవద్దు. యిక్కడ చిమ్మటయు, తుప్పును తినివేయును, దొంగలు కన్నమువేసి దొంగిలెదరు" (19 వచనం).

మన ఆస్తులన్నిటిని నిషేధించాలన్న ఈ వాక్యము యొక్క ఉద్దేశం కాదు. "సుఖముగా అనుభవించుటకు సమస్తమును మనకు ధారాళముగా దయచేయు దేవునియందు నమ్మికయుంచుడి" (1 తిమోతి 6:17; 4:4 చూడు) అని పౌలు వ్రాస్తున్నాడు. భవిష్యత్తు మేలు కొరకు సమకూర్చుకొనువాటియందు నిషేధం విధించుట మన వాక్య భాగం

లక్ష్యం కాదు. శీతాకాలముకొరకు ఆహారాన్ని సమకూర్చుకొను చీమలను సొలొమోను కొనియాడుతున్నాడు (సామెతలు 6:6-8). అయితే మరి యేసు మాటల ఉద్దేశం ఏమిటి? ఈ ప్రశ్నకు సమాధాం ప్రభుని "మీ కొరకు" అనే మాటల్లోనే ఉంది: "భూమి మీద మీ కొరకు ధనము కూర్చుకొనవద్దు." యేసు ఖండిస్తున్న విషయం గురించి జాన్ ఆర్. డబ్ల్యూ. స్టాట్ ఈ విధంగా వివరణిస్తున్నారు:

> స్వార్థంతో తమ కొరకు ఆస్తులను సమకూర్చుకొనడం, సుఖముగా, విలాసవంతముగా జీవిచండం, ప్రపంచంలోనున్న బీదవారు వారి యొక్క కనీస అవసరతలను గ్రహించలేని కఠిన హృదయం కలిగియుండడం. తను సమకూర్చుకున్న వాటియందే తన జీవితం ఆధారపడియున్నదన్న అవివేక మనసు [లూకా 12:15]; ఈ లోకం మీదనే మనసును కట్టిపడేసియుంటే స్వార్థ ఆర్జున తత్వంవంటి వాటిని తన శిష్యులు అనుసరించవచ్చని యేసు వీటిని ఖండించారు.[2]

"ధనమును విస్తారంగా సమకూర్చుకున్న ధనవంతులకు ఈ వర్తమానం కావాలి. నా దగ్గర అంత ధనం లేదు. ఏ రోజూ డబ్బు ఆ రోజే సంపాందించుకుంటున్నా, నాకెందుకు యిది"? భౌతిక ధనం గురించి ఈ వాక్యం చెబుతుంది. దీని అన్వయింపు ప్రతి ఒక్కరికీ వర్తిస్తుంది. ప్రతి ఒక్కరికీ "విలువైనది" అని ఏదో ఒకటి యుంటుంది. యిది మనకు చాలా ప్రాముఖ్యమైనది. యిది కుటుంబ సభ్యులు, యిల్లు, వృత్తి, పని, సంపద. ఒక వేళ అది మన దగ్గర లేకపోతే దానిని పొందుటకు శతవిధాలా ప్రయత్నిస్తాం. "మనం దేన్ని అధికంగా ప్రేమిస్తామో అది మన ధనమగును. అది మనది కానప్పటికి దానినే మనం పొందుటకు శతవిధాలా ప్రయత్నిస్తాం. ఒకవేళ అది మన దగ్గరుంటే అది జారిపోతుందేమోనని భయపడతాం" అని క్లోవీస్ జీ. ఛాపల్ అంటున్నాడు.[3] పైన చెప్పిన వాటిని కలిగియుండడం, వాటిని ఆనందించడం తప్పుకాదు గాని వీటిని ప్రాముఖ్యమైనవాటిగా ఎంచడం వీటి యెడల అధిక అభిమానమును పెంచుకోవడం చాలా పెద్ద తప్పు.

ఈ లోకములో మన కొరకు ధనమును సమకూర్చుకొనవద్దని మన వాక్య భాగములో యేసు మనలను హెచ్చరిస్తున్నారు. మన కనీస జ్ఞానానికి, మనసుకు తగినట్లుగా ఆయన ఈ విన్నపం చేస్తున్నారు. "భూమి మీద మీ కొరకు ధనమును కూర్చుకొనవద్దు. యిక్కడి చిమ్మటయూ, తుప్పును తినివేయును, దొంగలు కన్నము వేసి దొంగిలెదరు" (19 వచనం).

ఈ లోకములో మేముంటున్న ప్రాతంలో ధనమును దాచుకోవడానికి బ్యాంకులను ఆశ్రయిస్తారు. మిగిలిన ప్రాంతాల్లో అలా కాదు, పూర్వకాలంలో పరిస్థితి యిలా ఉండేది కాదు. బాలుడైన యేసు ఎదుట తమ "కానుకల పెట్టెలను" జ్ఞానులు తెరిచి యేసు కుటుంబమునకు యిచ్చినప్పుడు వారు ధనమును లేదా చెక్కు రూపంలోని నగదును యివ్వలేదు, వారు యిచ్చిన కానుకలు మరియు సంపద బంగారము, బోళము, సాంబ్రాణి రూపంలో యిచ్చారు (మత్తయి 2:11). (యివి ఖరీదు గలవి, చిన్నవిగా ఉండి మోసికొనుటకు వీలుగా ఉండి భద్రముగా దాచుకొనుటకు సౌకర్యవంతముగా ఉంటాయి.)

యేసు కాలంలో ప్రజలు తమ సొమ్మును బట్టలు,[4] ధాన్యము,[5] ఖరీదయిన ఖనిజాలు మరియు నగల మీద వెచ్చించేవారు. యివన్నియు కూడ దొంగిలంబడుతుండేవి. *వీటి విషయంలో యేసు పేర్కొన్న మొదటి నాశన కర్త సిమ్మట పురుగు.* మొదటి శతాబ్దంలో ఎంతో విలువైనవిగా ఎంతో వెలగల వస్త్రములను ఈ చిమ్మెట పురుగులు నాశనం చేస్తుండేవి.

ఈ పురుగులు గుడ్లు పెట్టి నిల్వ ఉన్న వస్త్రములను తింటూ తమ గుడ్లను పొదుగాయి. ఎక్కువ కాలం భద్రపరచిన విలువైన బట్టలను ఇవి చిన్న చిన్న రంధ్రాలు చేసి పాడు చేస్తాయి. బహుశ యిది మీకు అనుభవమైయుండి ఉండవచ్చు.

యేసు చెప్పిన *రెండవ నాశనకర్త* "తుప్పు." NASB మరియు యితర ట్రాన్స్లేషన్లలో యిది "తప్పుగా" చెప్పబడింది. తుప్పును (*brosis*) అన్న పదమునకు "తినివేయడం"[6] అని అర్థం. "తినివేసేది" అన్న అర్థంలో యిది చెప్పబడింది. ఇనుప పదార్థమును తినివేసే స్థితిని లేదా వెలగల ఖనిజ పదార్థములకు క్షయము కలుగజేసే స్థితిని తుప్పుపట్టడంగా పిలుస్తారు. నిలువ ఉంచిన ధాన్యమును పాడుచేసే ఎలుకలు మరియు కీటకములను కూడ యిది సూచిస్తుంది. ఎదుగుతున్న పంటలను నాశనం చేసే పసిరి పురుగులు, కీటకములను కూడ యిది సూచిస్తుంది.

యేసు చెప్పిన మూడవ నాశనకర్త దొంగలు. వీరు కన్నము వేసి దొంగిలస్తారు. పాలస్తీనాలో బాగా ఎండబెట్టి కాల్చిన యిటుకలలో ఇళ్ళను కడతారు. ఒకవేళ తలుపుకు తాళం వేసినా గాని, గోడకు కన్నము వేసి, దాని గుండ ఇంటిలో చొరబడి ఇంటిలోని విలువైన సామాగ్రిని దొంగలు దోచుకెళ్ళేవారు. పూర్వకాలంలో ఏదియూ భద్రముగా ఉండేది కాదు.

"కాని ప్రస్తుత పరిస్థి యిలా లేనందుకు ఎంతో ఆనందంగా ఉంది, బట్టలు పాడవకుండా చిమ్మట పురుగులకు స్ప్రేను వాడుతాను, కీటకములు, ఎలుకల కోసం ఉచ్చును వాడుతాను. దొంగలు పడకుండా యింటికి అలారమును పెట్టుకుంటాను"[7] అని ఒకరు అనవచ్చు. కాని, మీరెంత జాగ్రత్త వహించినా గాని, సొలొమోను చెప్పిన ప్రకారం అది రెక్కలు ధరించి యెగిరి పోతుంది (సామెతలు 23:5 చూడు). మన ధనమును కొల్లగొట్టువాటి వివరాలను లెక్కిస్తే అది అంతము లేకుండా ఉంటుంది.

తీవ్ర అస్వస్థత
వ్యాపార నష్టాలు
ఉద్యోగం కోల్పోవడం
ఆర్థికంగా చితికి పోవడం
ధనమును సద్వినియోగం చేయలేకపోవడం
ప్రకృతి విపత్తులు
యుద్ధాలు ... మొదలగునవి

ఒకవేళ వీటన్నిటినుండి తప్పించుకుని మీ జీవిత కాలమంతా మీ సంపదను జాగ్రత్తగా కాపాడుకున్నా గాని (హెబ్రీయులకు 9:27ఎ) మీరు ఒక రోజున చనిపోతారు. మీరు కూడబెట్టిన వాటినన్నిటిని విడిచిపెట్టి ఒంటరిగా వెళ్ళాల్సిందే. ఒక వ్యక్తి తన మరణం సమీపిస్తున్నది ఎరిగి తన ధనమంతటిని వజ్రములు, బంగారు నాణెములుగా మార్చి వజ్రములను మింగేశాడు. బంగారు నాణెములను తన ప్రేత వస్త్రముల అంచులో కుట్టించుకున్నాడు.[8] అతడి సంపద అతడితోకూడ సమాధికి వెళ్ళింది గాని అతని ఆత్మ వెళ్ళిన లోకమునకు వెళ్ళలేకపోయింది. ఈ సందర్భంలో యోబు యొక్క మాటలను ఉదహరించడం సముచితం: "నేను నా తల్లి గర్భములోనుండి దిగంబరినై వచ్చితిని, దిగంబరినై అక్కడికి తరిగి వెళ్ళెదను" (యోబు

1:21).

"లోకము, దాని ఆశయు గతించిపోవుచున్నవని" యోహాను వ్రాస్తున్నాడు (1 యోహాను 2:17). లోకమును చూచి ఎవ్వరైనా ఈ సత్యమును అంగీకరిస్తారు. కేవలం మనం సమకూర్చుకున్నవే గాక ఈ లోకంలో దాచబడిన ప్రతి సంపద కూడ నాశనమవుతుంది. ఆరోగ్యం చెడిపోతుంది. అందము నిరాకారమవుతుంది. బలము పనికిరాకుండా పోతుంది. నైపుణ్యత వ్యర్థమై పోతుంది. అలాగే మనం దేన్నయితే కోల్పోమనుకుంటామో అది తన స్వరూపాన్ని కోల్పోతుంది లేదా అసంతృప్తిలో ఉండేలా చేస్తుంది. కాబట్టి "భూమి మీద మీ కొరకు ధనము కూర్చుకొనవద్దు" అని యేసు హెచ్చరిస్తున్నారు ఎందుకంటే అవి మాయమైపోతాయి.

**కాని "పరలోకంలో"**

"పరలోకమందు మీ కొరకు ధనము కూర్చుకొనుడి. అచ్చట చిమ్మటయైనను తుప్పైనను దానిని తినివేయదు. దొంగలు కన్నము వేసి దొంగిలరు" (20 వచనం) అని యేసు చెప్తున్నారు. "పరలోకంలో చిమ్మట పురుగులు గాని, ఎలుకలు గాని, బందిపోటు దొంగలు గాని ఉండరు."[9] "పరలోకపు బ్యాంకులోని ప్రతి సొమ్ము కూడ అత్యంత భద్రం. ... అక్షయమైనదియు, నిర్మలమైనదియు, వాడబారనిదియునైన స్వాస్థ్యము మనకొరకు పరలోకమందు భద్రపరచబడి యున్నది" (1 పేతురు 1:4) అని పౌలు వ్రాస్తున్నాడు.

"పరలోకంలో నిధులను మనం ఎలా సమకూర్చగలం"? మన భౌతిక ఆశీర్వాదములను దేవుని ఉద్దేశములను నెరవేర్చుట కొరకు ఉపయోగించుట గురించి ఈ వాక్యం తెలియజేస్తుంది. యవ్వన అధికారితో యేసు మాట్లాడుతూ, "నీవు పరిపూర్ణుడవగుటకు కోరినయెడల పోయి నీ ఆస్తిని అమ్మి బీదలకిమ్ము, అప్పుడు *పరలోకమందు నీకు ధనము కలుగును*" (మత్తయి 19:21; నొక్కి చెప్పింది నాది) అని చెప్పారు. యిదే విషయం గరించి పౌలు తిమోతికి యిలా వ్రాస్తున్నాడు,

> ఇహమందు ధనవంతులైనవారు గర్విష్ఠులుగాక, అస్థిరమైన ధనమునందు నమ్మికయుంచక సుఖముగా అనుభవించుటకు సమస్తమును మనకు ధారాళముగా దయచేయు దేవునియందే నమ్మికయుంచుడని ఆజ్ఞాపించుము వారు వాస్తవమైన జీవమును సంపాదించుకొను నిమిత్తము రాబోవు కాలమునకు మంచి పునాది తమకొరకు వేసికొనుచు, *మేలు చేయువారును, సత్క్రియలు అను ధనము గలవారును, ఔదార్యముగలవారును, తమ ధనములో యితరులకు పాలిచ్చువారునై యుండవలెనని* వారికి ఆజ్ఞాపించుము (1 తిమోతి 6:17-19; నొక్కి చెప్పింది నాది).

"మనం కూడబెట్టుకున్న దానిని మనతోపాటు తీసుకెళ్ళలేం గాని, మన కొరకు దానిని మనకంటేముందుగా పంపించగలము" అని చెప్తారు. "మనం దేన్నయితే మనతో అట్టిపెట్టుకుంటామో దాన్ని కోల్పోతాం: దేన్నయితే మనం యిచ్చివేస్తామో దాన్ని మనం తిరిగి పొందుతాము" అన్న సత్యాన్ని గ్రహించాలి.

ఈ లోక ఆశీర్వాదాలను మనం సద్వినియోగం చేయుటవరకే పరలోకంలో నిధులు సమకూర్చుకొనడమన్న సూత్రం పరిమితం చేయబడలేదు. మనం ఏం చేసినా గాని ప్రతి విషయములో ప్రభువును అన్నిటి కంటే ప్రథమముగా ఎంచుట ద్వారాను పరలోకంలో

మనకొరకు ధనమును కూర్చుకొనగలం (మత్తయి 6:33). అలాగే కొండమీది ప్రసంగంలో చెప్పబడిన మాదిరిగా మన జీవన విధానం మార్చుకుని తదనుగుణంగా జీవించుట ద్వారాను పరలోకంలో మన కొరకు ధనమును సమకూర్చుకొనవచ్చు.

పరలోకంలో మనం ధనమును సమకూర్చుకొనుట ఎందుకు ప్రాముఖ్యము? ముందుగానే చెప్పుకున్న ప్రకారం ప్రభువు రెండవదిగా మన *హృదయాన్ని* సంధిస్తున్నారు. మన భావములతో ఆయన మాట్లాడుతున్నారు: "నీ ధనమెక్కడనుండునో అక్కడనే నీ హృదయము ఉండును" అని 21వ వచనంలో చెప్తున్నారు.

"నీ హృదయమెక్కడ ఉండునో అక్కడనే నీ ధనముండును" అని యేసు చెప్పి ఉండాల్సింది. మనం కూడ చెప్పిన దానికొరకు సమయం, డబ్బు, శక్తని ఖర్చు చేసుకుంటాం. యిందుకు సంబంధించినదైనా, దాగిన విభిన్నమైన విషయం గురించి యేసు యిక్కడ ప్రస్తావిస్తున్నారు. భూమి మీద విస్తారముగా ధనమును కూర్చుకుంటాం, యిక్కడే మన హృదయం ఉంటుందని ప్రభువు చెప్తున్నారు. ఒకవేళ మన యొక్క ధనమును పరలోకంలో కూర్చుకుంటే అక్కడే మన హృదయం ఉంటుంది. "ప్రొద్దు తిరుగుడు పువ్వు సూర్యుని అనుసరించినట్లు మన హృదయం మనం కూర్చుకొన్న ధనమును అనుసరిస్తుంది."[10]

కొద్దికాలం క్రితం, మెల్ల్ స్టిన్నట్ గారి క్లాసులో నేను హాజరయ్యాను. ఆఫ్రికా దేశములో ముప్పది సంవత్సరముల (1840–1873) పాటు మిషనరీగా పనిచేసిన డేవిట్ లివింగ్‌స్టన్ గారి గురించి ఆయన చెప్పారు. ఆయన చనిపోయినప్పుడు ఆయన మృతదేహం ఇంగ్లాండు దేశమునకు తేబడింది. కాని ఆయన హృదయం మాత్రం ఆఫ్రికా దేశములో ఆయన చనిపోయిన చెట్టు క్రిందనే పాతిపెట్టబడింది. ఈ విషయం చెప్పిన తరువాత, "విదేశీ ప్రజల మధ్య మీరు పనిచేసిన తరువాత, వారు మిమ్మల్ని సంవత్సరం పాటు అనుసరించిన తరువాత, ఒకవేళ మీరు చనిపోతే, వారుమిమ్మల్ని ఎక్కడ పాతి పెడతారు? మీ బ్యాంకు దగ్గరా లేక మీ గృహం వద్ద లేక మీ వ్యాపార స్థలం దగ్గరా? లేక మరో చోటునా?"[11] అని సహోదరుడు స్టిన్నట్ ప్రశ్నించారు.

ఈ నాడు మీ హృదయాలు ఎక్కడ ఉన్నాయి? మనము ప్రాముఖ్యమైనదని దేన్ని ఎంచుతున్నాం? పౌలు ఈ విధంగా వ్రాస్తున్నాడు, "మీరు క్రీస్తుతో కూడ లేపబడినవారయితే పైనున్న వాటినే వెదకుడి. అక్కడ క్రీస్తు దేవుని కుడి పార్శ్వమున కూర్చుండియున్నాడు. పైనున్న వాటిమీదనే గాని, భూసంబంధమైన వాటిమీద మనస్సు పెట్టకుడి" (కొలొస్సయులకు 3:1, 2).

### చీకటా లేక వెలుగా (6:22, 23)

ప్రభువు మనకు యిస్తున్న రెండవ అవకాశం వెలుగు మరియు చీకటి గురించి. దీనిని వివరించుటకు ప్రభువు ఒక ఉదహరణను ఉపయోగించారు. ప్రభువు ఉన్న దినాల్లో అది సర్వసాధారణం[12] మరియు అనేకమందికి అర్థమయ్యే రీతిలో ప్రభువు దీనిని చెప్పారు, కాని యిప్పటి దినాల్లో యిది సాధారణం కాదు. ఎంతోమందికి యిది చిక్కుముడిలా తోస్తుంది. ప్రభువు చెప్పిన మాటలు యివే:

> దేహమునకు దీపము కన్నే గనుక నీ కన్ను తేటగా ఉండినయెడల నీ దేహమంతయు వెలుగు మయమైయుండును. నీ కన్ను చెడినదైతే నీ దేహమంతయు

చీకటిమయమైయుండును. నీలోనున్న వెలుగు చీకటియైయుండిన యెడల ఆ చీకటి ఎంతో గొప్పది! (22, 23 వచనాలు).

**ఉపమానము**

యేసు యిక్కడ చిన్న ఉపమానమును అలంకార రీతిలో వాడారు.[13] ఉపమానలంకారమును అర్థం చేసుకోవాలంటే మొదటిగా ఉపమానలంకారమునకు అనుబంధంగా చెప్పబడిన విషయాన్ని సంగ్రహించాలి. ఈ సంధర్భంలో దేహమునకు మరియు కన్నుకు గల సంబంధాన్ని మనం గమనించాలి.

"దేహమునకు దీపము కన్ను": ఈ విధంగా దేహమునకు వెలుగును, ఎదుటి దృశ్యమును సాక్షాత్కరింపజేసేది కన్ను. మన ఎదుటి దృశ్యాలను కన్ను సంగ్రహించి కన్ను సంబంధ నాళముల ద్వారా సమాచారాన్ని మెదడుకు పంపుతుంది. తనకు అందిన సమాచారాన్ని బట్టి మెదడు దేహమును నియంత్రిస్తుంది. ఒకవేళ చూపు (కన్ను) సరిగా లేకపోతే, నీటి కాసులు శుక్లాలు వంటి వ్యాధుల బారిన కన్నుపడితే చూపు మందగిస్తుంది. యిది మెదడుకు చేరవేసే సమాచారం కూడ అస్పష్టంగా ఉంటుంది. ఒకవేళ కంటి చూపే లేకపోతే మెదడుకు ఎటువంటి సమాచారాన్ని కన్ను చేరవేయలేదు. దేహమునకు వెలుగును కలుగజేయుటకు ఏర్పాటుచేయబడ్డ ఒకే ఒక్క అవయవం కన్ను , కాబట్టి ఒక వేళ కన్ను చెడిపోతే, "ఆ చీకటి ఎంతో గొప్పది!"

**సందేశం?**

కన్ను మరియు దేహమునకు గల సంబంధమును అర్థం చేసికొనుట కష్టం కాదు. అయితే ఈ సంబంధమును ఉపమాన రీతిగా చెప్పుట ద్వారా ప్రభువు ఎటువంటి సత్యమును తెలియజేయదలిచారు? యేసుని సందేశమును అర్థం చేసుకోవాలంటే మొదటిగా నేపథ్యాన్ని గమనించాలి. దీని ముందు వచనాల్లో (19–21 వచనాలు). ఈ భూమిమీద విస్తారముగా ధనమును కూర్చుకొనుట గురించి ప్రభువు హెచ్చరిస్తున్నారు. తరువాతి వచనంలో (24 వచనం). దేవుడు లేదా సిరి, ఈ రెండింటిలో ఏదో ఒక విషయాన్ని ఎంచుకోవాల్సిందిగా ప్రభువు సందేశమిస్తున్నారు. కాబట్టి, 22 మరియు 23 వచనాలు ప్రథామికంగా భౌతిక సంపద గురించి తెలియజేస్తున్నాయన్న విషయాన్ని సంగ్రహించవచ్చు.

వాక్య భాగములో చెప్పబడిన "తేటగా" మరియు "చెడిన" అను పదముల వ్యత్యాసమును గురించినట్టయితే, కన్నును గురించి చెప్పబడిన వివరణను అర్థం చేసికొనడం ఎంతో సులభం. "తేట" అను మాట *haplous* అను పదమునుండి వచ్చింది. శరీరక కన్ను గురించి చెప్పాలంటే హప్లస్ అంటే "స్పష్టమైన, తేటయైన, ఆరోగ్యకరమైన"[14] అని అర్థం. దీని యొక్క ప్రాథమిక అర్థం "నిష్కపటం" యిదే అర్థంలో హప్లస్ అను మాట ఎఫెసీయులకు 6:5 మరియు కొలొస్సయులకు 3:22 వాక్యభాగములో ఉపయోగించబడింది. నేపథ్య ప్రకారం యిది యథార్థత అను అర్థమునిస్తుంది. NASBలో యిది యథార్థమైన హృదయం అని వ్రాయబడగా, KJVలో "నిష్కపటమైన హృదయం" అని వ్రాయబడింది. ఈ మాటను అన్వయిస్తూ బోధకులు మనమందరం "ఏక మనస్కులై" ఉండవలెనని బోధిస్తాడు (ద్విమనస్కులు గాకుండా! [యాకోబు 1:8ను చూడు]). ఈ నిర్వచన సహాయంతో

ఈ ఉపమానమును 24వ వచనముతో కలపి దీని సందేశమును అర్థము చేసికొనగలం. ఎవరూ కూడ యిద్దరు యజమానులకు దాసుడైయుండలేడు (ద్విమనస్కుడు ఈ విషయంలో యత్నించిన విధముగా!) హప్లస్ అను పదమునకు "ధారాళత" అను అర్థము కూడ ఉన్నది. ఈ పదము రోమీయులకు 12:8 మరియు 2 కొరింథీయులకు 8:2లో "దాతృత్వముగా" అనువదించబడింది.

"చెడు" అను పదము *poneros* అను పదమునుండి వచ్చినది. యిది "దుష్టత్వమును" సూచిస్తుంది.[15] ఈ అర్థాన్ని కన్ను విషయంలోనూ అన్వయిస్తే, "దయనీయ స్థితిలోనున్న జబ్బు" అనే అర్థములో వస్తుంది. పాత నిబంధన యొక్క గ్రీకు తర్జుమాలో (LXX ) "చెడ్డ కన్ను" అనుమాట పిసినారి తనాన్ని సూచిస్తున్న విషయం యిక్కడ ప్రస్తావనాంశం. ఉదాహరణకు ద్వితీయోపదేశకాండము 15:9ను గమనించండి, "బీదవాడైన నీ సహోదరుని యెడల కటాక్షము చూపక నీవు వానికేమియు యియ్యకపోయిన యెడల వాడొకవేళ నిన్ను గూర్చి యెహోవాకు మొఱ్ఱపెట్టును." దీనిని మన వాక్యమునకు అనుగుణంగా వ్యతిరేక అర్థముతో పోలిస్తే యివి కరుణ చూపే కన్ను మరియు "పిసిన తన కన్నుకు" గల వ్యత్యాసాన్ని యిక్కడ చూస్తాము.

"తేట" మరియు "చెడిన" అను పదము అర్థాన్ని పోల్చుతూ వాటిలో ఏదో ఒక దానిని ఎంచుకొనవలసిన అవసరం యిప్పుడు లేదు గాని మన సంపద పట్ల *అనారోగ్యం* వైఖరి గాక, ఆరోగ్యకర వైఖరినే మనం అవలంబించాలని ప్రభువు మనలను కోరుతున్నారు. దేవుని విషయాలపట్ల మనం *ఏకమనస్కులమైయుండాలి.* అన్న విషయాలకంటే ప్రాముఖ్యంగా దేవుని రాజ్యమునే మొదట వెదకాలి (33 వచనం). యిటువంటి సమయంలో యితరులకు సహాయం చేసే విషయంలో మనం పిసినారి తనంగా ఉండక దాతృత్వ స్వభావ్ని కలిగియుంటాము.

"కన్నును" గురించిన విషయాలను మనమీ రోజున ఎన్నో ప్రస్తావిస్తున్నాం "చూస్తున్నాను" "అర్థం అయింది" వంటి మాటలతో పాటు "పరిశీలనా దృక్పథం" కలిగియుండడం గురించి, మన జీవితంలో "ముందు చూపు కలిగియుండడం" గురించి ఎన్నో మాటలు రోజూ ప్రస్తావిస్తుంటాం. "చూడడం" "దృష్టియుంచడం" గురించి ఎన్నో మాటలు చెబుతుంటాము. 22 మరియు 23 వచనాలను మనకు అన్వయించుకుంటే మన జీవితాన్ని చూసుకునేదిగా "కన్నును", మనమెటువంటి వారము, *మన* జీవితం ఏమైయుందన్న విషయాన్ని తెలియజెప్పేదిగా "దేహాన్ని" మనం చూస్తాం.

మన జీవితాన్ని కాపాడుకొనుట మన దేహం పై ప్రభావాన్ని చూపుతుంది. మన యొక్క చూపు ఆరోగ్యకరంగ ఉంటే, దేవుని విషయంలో మనం ఏకమనస్కులమైయుంటే, యితరులు సహాయం చేసే విషయంలో దాతృత్వమును కలిగియుంటే అప్పుడు మన జీవితమంతా వెలుగుమయమై ఉంటుంది. అలాగాకుండా మన దృష్టి అనారోగ్యకరంగా ఉంటే మన యొక్క ఉద్దేశాలు దురుద్దేశ పూర్వకరంగానూ, అంతా సంపాదించాలనే స్వార్థ భావములు, పిసినారితనం ఉంటే మన జీవిమంతయు దేహమంతటిలోనూ చీకటి అలుముకుంటుంది. మనకు వెలుగును (తేటగానున్న చూపును) యిచ్చేది చీటిగా మారిపోతే మన ఆత్మలోని చీకటి ఎంత విస్తారముగా ఉంటుందో!

ఈ సందేశమిస్తున్నప్పుడు యేసుని మనసులో శాస్త్రులు, పరిసయ్యులున్నారు. వారు తాము వెలుగులోనున్నామని భావించేవారు. అలాగాక వారు చీకటిలోనున్నారని ప్రభువు

చెప్తున్నారు. ఈ రోజున అనేకమంది తాము వెలుగులోనున్నామని అనుకుని మోసపోతున్నారు. వారు "దేవుని ఆజ్ఞలకు లోబడక మహోన్నతుని తీర్మానమును తృణీకరించినందున బాధచేతను, యినుపకట్ల చేతను బంధింపబడినవారై చీకటిలోను, మరణాంధకారములోను" నివసిస్తున్నారు (కీర్తనలు 107:10, 11). "మనం అంధకారములోనున్నామన్న విషయన్ని గుర్తించలేకపోవడం మరింత దుర్భర విషయం."[16]

## సిరి లేదా దేవుడా? (6:24)

మన వాక్య భాగంలోని చివరి సవాలు దేవుడు మరియు సంపదలలో ఏదో ఒకదాన్ని ఎంచుకోవడం గురించి ఇయ్యబడింది. నిజానికి అన్ని ఛాయిసులు కూడ దీని గురించే యియ్యబడ్డాయి. ఈ భూమి మీద మీ కొరకు ధనమును కూర్చుకొనుటయందు అమితాసక్తిని చూపుతున్నారా? దీనియందే మీకు ఆసక్తి ఉంటే మీరు సిరినే ఎంచుకుంటున్నారు. పరలోకంలో మీ కొరకు ధనమును కూర్చుకొనుటయందు ఆసక్తిని మీరు చూపుతున్నారా? దీనియందు మీకు ఆసక్తి యుంటే మీరు దేవున్ని ఎంచుకుంటున్నారు. మీరు దేన్నయితే ప్రాముఖ్యమైనదిగా ఎంచుతున్నారో వాటిని మీరు ప్రాముఖ్యమైన వాటిగా ఎంచుతున్నారా? దీనర్థం మీరు దేవుని ఎంచుకుని తద్వారా మీలో వెలుగును నింపుకుంటున్నట్లు.

### ఎంచుకొనవలసిన ఆవశ్యకత

దేవుడు మరియు సిరి – ఈ రెండింటిలో ఏదో ఒకదానిని ఎంచుకొనవలసిన ఆవశ్యకత గురించి మొదటిగా తెలియజేస్తన్నారు. 24వ వచనంలోని ఆయన ఆరంభపు మాటలు "ప్రభుని వాక్యములలో జ్ఞాపకముంచుకొనదగ్గ వాటిలో ఒకటిగా"[17] పేర్కొనబడింది. "ఎవడును యిద్దరు యజమానులకు దాసుడుగా ఉండనేరడు. అతడు ఒకని ద్వేషించి[18] ఒకని ప్రేమించును. లేదా ఒకని పక్షముగానుండి యొకని వ్యతిరేకించును. మీరు దేవునికిని సిరికిని దాసులుగా నుండనేరరు" (24ఎ, బి వచనం).

"కాని ఒక వ్యక్తి యిద్దరు వ్యక్తుల వద్ద పనిచేస్తూ రెండు ఉద్యోగాలు చేయగలడు గదా!" అని ఒకరు అడ్డుచెప్పవచ్చు. ప్రభువు యిక్కడ ఉద్యోగస్తుల గురించి గాక *దాసుని* గురించి మాట్లాడుతున్నారు. యిక్కడ దాసత్వము (*douleuo*) అను మాటకు "డ్యూలోస్ ['slave']" వలె పనిచేయుట అని అర్థం.[19] "ఒక ఉద్యోగి రెండు ఉద్యోగాలు చేయగలడు గాని, ఏ దాసుడు యిద్దరు యజమానుల దగ్గర పనిచేయలేడు" అని ఏ. హెచ్. మెక్‌నీల్ వ్రాస్తున్నాడు.[20] "ఒకే యజమానుని వద్ద నమ్మకంగా పనిచేయడం మరియు పూర్తికాలం పనిచేయడం అనేది దాసత్వపు ప్రాథమిక విధానం" అని ఆర్. పి. డి. టాస్కర్ పేర్కొన్నాడు.[21]

కొంత మంది యిద్దరు యజమానులకు ఏకకాలంలో దాసత్వము చేయడానికి ప్రయత్నించారు. కొన్ని దేశములు "యెహోవాయందు భయభక్తులు కలిగియుండి" అదే సమయంలో వారు "విగ్రహమును పూజించారు" (2 రాజులు 17:41; 24–41 వచనాలు చూడు). ఈ నాడు కూడ కొంతమంది ఆదివారమున దేవుని ఆరాధించి మిగతా రోజులను లోకమునకు అప్పగిస్తున్నారు. "ఎవడును యిద్దరు యజమానులకు దాసుడుగా ఉండనేరడు" అని ప్రభువు విషయాన్ని స్పష్టం చేస్తున్నారు.

**రెండు అవకాశాలు**

యేసు మనసులోనున్న ఆ యిద్దరు యజమానులు ఎవరు? ముందు గానే చెప్పిన ప్రకారం దేవుడు లేదా సిరి ఈ రెండింటిని గురించి ఆయన మాట్లడుతున్నారు. 24వ వచనం చివరిలో "మీరు దేవునికిని సిరికిని దాసులుగా యుండనేరరు" అని ఆయన చెప్తున్నారు.

"సిరి" (*mamonas*) అను మాట KJVలో "సిరి దేవతగా" "*mammon*" వ్రాయబడింది. సిరిదేవత "*mammon*" అనేది "సిరి అను అరామిక్ పదం యొక్క గ్రీకు రూపము."[22] ఈ వాక్య భాగములో సిరిదేవత/సిరి[23] బానిస యొక్క యజమానిగా వ్యక్తీకరించబడింది.[24] "చాలామంది తాము ఏదైతే కలిగియున్నారో దానికే బానిసలవుతున్నారు" అని జాక్‌య పి. లూయిస్ వ్రాస్తున్నాడు.[25] ధనము మంచి దాసుడే గాని కాఠిన్య యజమాని అని ఒక సామెత. ఒకరి ప్రతిచర్య కూడ ధనము మీదనే ఆధారపడి యున్న వ్యక్తుల గురించి మీకు ఈ సమయంలో గుర్తుకు వచ్చియుండవచ్చు. ఈ వాక్యమును మన జీవితమునకు అన్వయించుకుందాము. మనకు తెలియకుండానే మనలో చాలామంది కొంతవరకు ధనమునకు బానిసలమైపోతుంటాం. యిందునుబట్టి మనం అపరాధ భావనలో పడిపోతుంటాం.

మనం సిరికిని మరియు దేవునికిని దాసులుముగా *యుండకూడదని* ప్రభువు చెప్పడం లేదు గాని సిరికిని మరియు దేవునికి దాసులుగా *యుండలేమని* తెలియజేస్తున్నారు. యిక్కడ ప్రభువు యిది లేదా అది అన్న విషయం గురించి మాట్లాడుతున్నారు. "అతడు *ఒకని* ద్వేషించి యొకని ప్రేమించును. *లేదా* యొకని పక్షముగానుండి యొకని తృణీకరించును" (24 వచనం; నొక్కి చెప్పింది నాది). ఈ రెండింటికి బద్దుడైయుండుటలోని వివాదాన్ని గమనించండి:

> వారు మనకు విధించిన విధులు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. ఒకరు విశ్వాసం ద్వారా జీవించమంటే మరొకరు కంటికి యిష్టం వచ్చినట్లు జీవించమంటారు; ఒకరు విధేయతగా ఉండాలంటే, మరొకరు గర్వముగా ఉండాలంటారు; ఒకరు పైనున్నవాటి మీద మనస్సుంచమంటే, మరొకరు భూమి మీదనున్నవాటిపైన మనస్సుంచమంటారు; ఒకరు కంటికి కనబడని మరియు సత్యమైన వాటియందు దృష్టియుంచమంటే, మరొకరు కంటికింపుగా ఉండేవి మరియు అనిత్యమైన వాటియందు దృష్టియుంచమంటారు; మనకు పరలోకంలో పౌరసత్వం ఉందని ఒకరు చెబితే, మరొకరు ఈ మట్టినే నమ్ముకోమంటారు; మనము జాగ్రత్తగా ఉండాలని ఒకరు అంటే మరొకరు అన్నిటికి ఉద్రేకపడాలని చెబుతారు; మీకున్నవాటితోనే సంతృప్తిగా ఉండాలని ఒకరు అంటే, నరకమంత విస్తారముగా దురాశ ఉండాలని మరొకరు చెబుతారు; ఒకరు ఇమ్మంటే మరొకరు అట్టిపెట్టుకోమంటారు. యితరుల గురించి కూడ ఆలోచించమని ఒకరు చెబితే స్వంత విషయాలే ఆలోచించమని మరొకరు చెబుతారు; సృష్టికర్తయందు ఆనందించమని ఒకరు చెబితే, సృష్టియందు ఆనందించమని మరొకరు చెబుతారు. దీన్నిబట్టి యిద్దరు యజమానులకు దాసుడైయుండలేమన్న విషయం స్పష్టమయిందా?[26]

సాతాను తన దుష్ట ఉద్దేశముల నిమిత్తం ధనమును ఒక సాధనంగా ఉపయోగించుకుంటాడు. ద్విమనస్తత్వాన్ని అతడు లక్ష్యపెట్టడు. యిందు నిమిత్తమే దేవుని మరియు సిరిని సేవించువాడు నిజానికి దేవున్ని విడిచిపెట్టినట్లే, ద్విమనస్కులను దేవుడు సహించలేడు. "యెహోవాను నేనే ఇదే నా నామము. మరి ఎవనికిని నా మహిమను నేనిచ్చువాడను కాను" (యెషయా 42:8ఎ) అని దేవుడు సెలవిస్తున్నాడు.

"ఈ ఆకర్షణీయమైన తాత్కాలిక లోకములో వీటన్నిటి మధ్య ఆత్మీయ జీవనాన్ని

చేయగలగడం ధార్మికపరంగా ఒక గొప్ప సవాలు" అని ఈ. స్టాన్లీ జోన్స్ చెప్తున్నాడు.[27] మనమీ లోకంలో ఉంటూనే ఈ లోకాన్ని జయించడం క్రైస్తవులుగా మనకు ఒక సవాలు (1 యోహాను 5:4). దీనికి సమాధానంగా, ఈ లోకంనుండి వేరై ఒంటరిగా ఎవ్వరూ కనబడని ప్రాంతంలో నివసిస్తే, ఈ సమస్య పరిస్కారమైపోతుందని కొంతమంది భావిస్తుంటారు. కాని దేవుడు ఆశిస్తున్న పరిష్కారం యిది కాదు. మనం "ఈ లోకంలో ఉన్నాగాని" మనమీ "లోక సంబంధులు కాకుండవలెనని" (యోహాను 17:11, 16). ఈ లోకపు విషయాలను గాక దేవున్నే మనం ఎంచుకోవాలని ఆయన ఆశిస్తున్నాడు. అప్పుడు మాత్రమే మనం ఈ లోకమునకు "ఉప్పు మరియు వెలుగుగా" ఉంటాము (మత్తయి 5:13, 14).

**ముగింపు**

నిర్ణయం, నిర్ణయం, నిర్ణయం – మనలో ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ చేయవలసినది యిదే. కొన్ని అంత ప్రాముఖ్యం కాదు గాని కొన్ని ఎంతో ప్రాముఖ్యమైనవి. యిందుకోసం కొంతమంది కొద్దిసేపు ఆలోచిస్తే సరిపోతుంది కాని మరికొంతమంది యిందుకోసం అందుబాటులోనున్న ప్రతి వనరును ఉపయోగించుకుంటారు. మనం తీసుకునే అన్ని నిర్ణయాలలో కంటే వీటికంటే ప్రాముఖ్యమైనవి ఏదీ లేదు.

- పరలోకంలో నిధులను కూర్చుకొనడమా లేక భూమి మీద నిధులను కూర్చుకొనడమా.
- మన జీవితం వెలుగు మయమైయుండాలన్న కాంక్షతో తేటయైన చూపును కోరుకోవడం లేదా మన జీవితం చీకటిమయమైయుండాలన్న తలంపుతో చెడిన చూపును కోరుకోవడం.
- దేవున్ని సేవించడం లేదా సిరిని సేవించడం.

మత్తయి 6:19–24లోని సందేశాన్ని మనం గ్రహించినట్లయితే, ఈ నిర్ణయాలు తీసుకోవడం మనకు కష్టం కాదు. శ్రేష్ఠమైన వాటిని పొందడానికి ఈ లోకపు విలువలేని వారిని తిరస్కరించనివాడు ఎవడు? వెలుగులో నడిచేలా చీకటిని తన జీవితంలోనుండి తప్పించాలని చూడనివాడెవడు? మృతతుల్య లోకంలోని క్షయమగు వాటిని విడువక నిత్యుడైన తండ్రి ఎదుట మోకరింపనివాడు ఎవడు?

మన నిర్ణయాన్ని వాక్యపు వెలుగులో పరిశీలిస్తే అదేమంత కష్టంగా ఉండదు అలాగాక, ప్రపంచంలోని అనేకమంది తమ జీవితం గురించి మరియు రాబోవు జీవితం గురించి తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారు. నీ సంగతి ఏంటి? నీవు ఏ నిర్ణయం తీసుకుంటున్నావు? యిదే నిర్ణయం తీసుకోవాల్సిన సమయం.

---

సూచనలు

[1]మీరున్న ప్రాంతంలోని ప్రజలు తీసుకునే ముఖ్యమైన నిర్ణయాలకు అనుగుణంగా ఈ పేరాను అన్వయించుకొనండి. [2]John R. W. Stott, *The Message of the Sermon on the Mount,* The Bible Speaks Today series (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1978), 155. [3]Clovis G. Chappell, *The Sermon on the Mount* (Nashville: Abingdon-Cokesbury Press, 1930), 179. [4]నామాను ఎలీషాకు ఇచ్చిన కానుకలలో దుస్తులు

కూడ ఉన్నాయి (2 రాజులు 5:5 చూడు). [5]లూకా 12:16–19 చూడు. [6]W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 541. [7]మీరున్న ప్రాంతానికి అనుగుణంగా దీనిని అన్వయించుకొనండి. [8]Adapted from David F. Burgess, comp., *Encyclopedia of Sermon Illustrations* (St. Louis, Mo.: Concordia Publishing House, 1988), 95. [9]Stott, 156. [10]రచయిత తెలియదు; quoted in Frank L. Cox, *Sermon Notes on the Sermon on the Mount* (Nashville: Gospel Advocate Co., 1955), 17.

[11]Mel Stinnett, "Choosing Your Master," lesson taught at Eastside church of Christ, Midwest City, Oklahoma, 10 August 2005. [12]మరో సందర్భంలోనూ యేసు యిలాంటి ఉదాహరణనే పేర్కొన్నారు (లూకా 11:33–36 చూడు). [13]ఒక విషయాన్ని చెప్పుట లేదా పోల్చుటకు, పోల్చి చెప్పే పదాలు ("వంటి" లేదా "యిలా") లేకుండా అలంకార రీతిలో చెప్పబడే కథనే ఉపమానమంటారు. D. R. Dungan, ప్రకారం, విస్తరించి చెప్పిన ఉపమానమే కథ (*Hermeneutics* [Delight, Ark.: Gospel Light Publishing Co., n.d.], 258-260). [14]Walter Bauer వ్రాసిన *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature,* 4th ed., rev. and aug. సేకరించబడింది. William F. Arndt and F. Wilbur Gingrich (Chicago: University of Chicago Press, 1957), 85. [15]*Poneros* గురించిన ఈ సమాచారం from Arndt and Gingrich, 697. [16]D. A. Carson, "Matthew," *The Expositor's Bible Commentary,* vol. 8 (Grand Rapids, Mich.: Regency Reference Library, Zondervan Publishing House, 1984), 178. [17]Robert H. Mounce, *Matthew,* New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1991), 60. [18]"ద్వేషించుట" మరియు "తృణీకరించుట" విరుద్ధార్థములతో ఉపయోగించబడ్డాయి. ఒకరు యిద్దరు యజమానులకు సమానంగా దాస్యత్వము చేయలేదని ప్రభువు చెప్తున్నారు. [19]Vine, 562-63. క్రొత్త నిబంధనలో డ్యులాస్ అను మాట దాస్యత్వమును సూచించుట లేదు కాని మత్తయి 6:24లో ప్రభువు యజమాని/దాసుని సంబంధం గురించి తెలియజేస్తున్నారు. [20]Quoted in Stott, 158.

[21]Ibid. [22]Jack P. Lewis, *The Gospel According to Matthew, Part 1,* The Living Word Commentary series (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 107. [23]భూమి మీద మనం దాచుకున్న ప్రతి దానికీ ఈ అన్వయింపు వర్తిస్తుంది (ఈ పాఠములోని "సంపదల" గురించి చూడండి). [24]వ్యక్తీకరించడం అంటే ఒకదానికి వ్యక్తిలాగా అభివర్ణించడం. [25]Lewis, 107. [26]"Jay," quoted in Arthur W. Pink, *An Exposition of the Sermon on the Mount* (Grand Rapids, Mich.: Baker Book House, 1950), 215-16. [27]E. Stanley Jones, *The Christ of the Mount* (New York: Abingdon Press, 1931), 220.